నష్టం. ప్రతీ సంవత్సరం మనదేశంలో మతకల్లోలాల వల్ల వందల ప్రాణాలు పోతాయి. కేవలం ఒక బొంబాయి-భివాండి మతకల్లోలాలలోనే ఒక్క వారం రోజులలో (1984 మే 18 నుండి 25 వరకు) 258 ప్రాణాలు పోయాయని అధికార్ల అంచనా. (అనధికార అంచనా ప్రకారం భివాండిలోనే 400 మంది చనిపోగా థానె-బొంబాయి ప్రాంతంలో మరింతమంది చనిపోయారు.) ఒక్కొక్క సంవత్సరం మతపరమయిన ఘర్షణకు సంబంధించిన సంఘటనలు (చిన్నవీ పెద్దవీ) వేల సంఖ్యలో జరగడం బట్టి చూస్తే ఈ ప్రాణనష్టం ఎంత వుందో అర్థం అవుతుంది. 1977లో 6,258 ఘర్షణలు జరుగగా 1982లో 3,690, 1983లో 4000 జరిగాయి. గత సంవత్సరం మార్చి నెలలో జరిగిన ఒక్క అస్సాం కలహాలలోనే 3,500 పైగా చనిపోయారు.

విభ్రాంతి కలిగించే విషయం ఏమిటంటే ఈ మరణాలలో అధికభాగం కల్లోలంలో కాక శాంతి భద్రతల సంరక్షకులయిన పోలీసుల కాల్పులలో జరగడం. అస్సాంలో దాడి చేసిన వాళ్ళలో పోలీసులే ముందున్నారని చెప్పారు. మీరట్ అల్లర్లలో PAC (ఉత్తరప్రదేశ్ రాష్ట్ర సాయుధ పోలీసుదళం) వాళ్ళే ఫిరోజ్ బంగళానుండి దాదాపు 50 మందిని బయటకు లాగి కాల్చి చంపారు. హైదరాబాద్‌లో ఒక ఎస్.ఐ స్కూలునుండి తిరిగివస్తున్న ఇద్దరు విద్యార్థులను కాల్చి చంపినట్లు రిపోర్టు వుంది.

సారాంశంలో ఈ మత కలహాలనేవి వేలాది పేదప్రజల పౌరహక్కులను మానవ హక్కులనేకాక ప్రాణాలు గూడా తీస్తున్నాయి. మరొక విచారకరమయిన విషయం గూడా వుంది. విమాన ప్రమాదంలో గాని రైలు ప్రమాదంలో గాని చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తగు నష్టపరిహారం యిస్తుంది. కాని మత కల్లోలాలలో చనిపోతే మాత్రం 3 లేక 5వేల రూపాయలతో సరిపెట్టుకుంటుంది. 1982లో ప్రకటించిన మైనారిటీ కమీషన్ రిపోర్టు ఈ విధంగా అంటుంది "సంపాదనాపరులయిన వ్యక్తులు చనిపోయిన కుటుంబాలకు జీవనం గడవడానికి ఆర్థిక సహాయం చేయాలి, ఆ కుటుంబంలో ఒకవ్యక్తికయినా ఉద్యోగం చూపించాలి. గాయాల వల్ల మొత్తంగాగాని పాక్షికంగాగాని అంగవైకల్యం పొందిన వారికి గూడ జీవనం సంపాదించడానికి ప్రభుత్వం తగినంత ఆర్థిక సహాయం చేయాలి" అయితే నష్టపరిహారం ఎంత ఇవ్వాలో నిర్దిష్టంగా ఈ నివేదిక చెప్పలేదు.

ఈ నష్టపరిహారం విషయాన్ని మైనారిటీస్ కమిషన్ సుప్రీం కోర్టుకు రిఫర్‌చేయగా జస్టిస్ ఖన్నా తదితరులు ఈవిధంగా అన్నారు. ప్రభుత్వంయొక్క చట్టపరమయిన బాధ్యతేకాక నైతిక బాధ్యతను గూడ లెక్కలోకి తీసుకోవాల్సి వుంటుంది. వరదలు తుఫానులు వచ్చినప్పుడు ప్రభుత్వం బాధ్యత వహించాలని ఏ చట్టమూ చెప్పక పోయినా ప్రభుత్వం తగుమాత్రం నష్టపరిహారం చెల్లించే బాధ్యత తనమీద వుందని అంగీకరిస్తుంది. ఇక్కడ వరదలు, తుఫానులు సంభవించాయన్నది ముఖ్య విషయంకాదు, ప్రజల ఇక్కట్లు ముఖ్య విషయం. కాబట్టి మతకల్లోలాల సందర్భంలో సంభవించే ఆస్తిప్రాణ నష్టాన్ని ప్రకృతి వైపరీత్యాల ఫలితంగా జరిగే నష్టంతో సమంగా చూడవచ్చు! ఈ విధంగా నష్టపరిహారం చెల్లించే నైతిక బాధ్యతను సుప్రీంకోర్టుప్రభుత్వంమీద పెట్టినా, ప్రభుత్వం మాత్రం ఆ బాధ్యతను ఎంత మాత్రం స్వీకరించడంలేదు. మత కల్లోలాలు జరిగినప్పుడల్లా జీవనాధారాన్ని కోల్పోయిన కుటుంబాలు బాధలపాలు అవుతూనే ఉన్నాయి.

## రిజర్వేషన్ వ్యతిరేక ఉన్మాదం

గుజరాత్ రిజర్వేషన్-వ్యతిరేక ఉద్యమం "అయిపోయింద"ని పత్రికలు రాసాయి. సోలంకి ప్రభుత్వం రాజీనామా చేయగానే కొందరు విరమించుకున్నారు, కొంతకాలం ఆగి మరి కొందరు విరమించుకున్నారు. దీన్నిబట్టి చూస్తే ఈ "ఉద్యమం" నడిపిన వాళ్ళ అసలు లక్ష్యం ఏమిటా అని అనుమానం వస్తుంది.

అదెట్లాగున్నా గుజరాత్ ఉద్యమం "అయిపోయింద"నడం పొరబాటు. బహుశా రాబోయే కాలానికి అది నాంది కావచ్చు. అందుకోసమయినా ఈ ఉద్యమం తీరుతెన్నులను సమీక్షించాలి. గుజరాత్‌లో అగ్రవర్ణాలవాళ్ళు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉద్యమం నడపడం ఇది మొదటిసారి కాదు. 1981లో ఒకసారి ఇట్లాంటి ఉద్యమమే నడిపి, రిజర్వేషన్ల వల్ల కొంత ప్రయోజనం పొందిన "వణ్కర్" అనే హరిజన కులంమీద బాహాటంగా దాడులు జరిపి చాలామందిని హతమార్చారు.

ఈ సంవత్సరం మార్చిలో రాబోయే ఎన్నికలను దృష్టిలో వుంచుకొని గుజరాత్ కాంగ్రెస్ (ఐ) ప్రభుత్వం బి. సి వర్గాలకు రిజర్వేషన్ 10 శాతం నుండి 28 శాతానికి పెంచింది. ప్రభుత్వం నియమించిన రాణె కమీషన్ ఈ హెచ్చింపును సూచించింది, కాని ఆ కమీషన్ బి సి వర్గాలను నిర్ణయించడానికి కుల ప్రాతిపదిక బదులు ఆర్థిక ప్రాతిపదిక (సంవత్సర ఆదాయం రూ॥ 10,000లోపు) సూచించింది. గుజరాత్ ప్రభుత్వం ఈ సూచనను పట్టించుకోకుండా కుల ప్రాతిపదికమీద 28 శాతానికి పెంచింది.

వెంటనే అగ్రవర్ణాలకు చెందిన యువకులు రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం ప్రారంభించారు. ఏ అహమ్మదాబాద్ ఇంజనీరింగ్ కాలేజి నుండయితే 1973లో అధిక ధరలకు వ్యతిరేకంగా అత్యంత ప్రజాస్వామికమయిన ఉద్యమం మొదలయిందో అదే కాలేజి నుండి ఈ మౌలికంగా అప్రజాస్వామికమయిన "పోరాటం" ఫిబ్రవరి 18 నాడు ప్రారంభమయింది. నెలాఖరులోపల 30 బస్సులు దగ్ధమయ్యాయి. అయినప్పటికీ పెద్ద ఎత్తున ఉద్యమం బలం పుంజుకోలేదు.

మార్చి మొదటి వారంలో ఎన్నికలు జరిగి సోలంకి ప్రభుత్వం గద్దెనెక్కింది. వెంటనే రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం బలం పుంజుకోవడం మొదలుపెట్టింది. ఎన్నికలలో టిక్కెట్లు దొరకని కాంగ్రెస్ నాయకుల హస్తం, సోలంకిని ఎట్లాగయినా దించేయాలని తాపత్రయం ఉన్న బి. జె పి హస్తం, ఇందులో స్పష్టంగావుంది.

అందుకనే ఎన్నికల ముందు కనపడని ఉత్సాహం కొత్త ప్రభుత్వం ఏర్పడగానే పుట్టుకొచ్చింది.

కాంగ్రెస్ (ఐ) తక్కువ తినలేదు. మార్చి 15 నుండి బలం పుంజుకొన్న ఉద్యమకారులే మార్చి 18 నాడు అహమ్మదాబాద్ బంద్‌ను విజయవంతంగా నిర్వహించింది. ఆ సాయంత్రం అహమ్మదాబాద్‌లో మతకల్లోలాలు ప్రారంభమయినాయి. మార్చి 19, 20 తేదీలలో గూడ కొనసాగాయి. దర్యాపూర్, నగినాపూర్, వాడినగర్, నవరంగ్‌పురా, తదితర ప్రాంతాలలో కత్తిపోట్లు, దుకాణాలు కాలబెట్టటం, వగైరా చర్యలు ఒక పద్ధతి ప్రకారం జరిగాయి. కత్తిపోట్లలోనూ పోలీసు కాల్పులలోనూ 19 మంది చనిపోగా 52 మంది గాయపడ్డారు.

గమనించదగ్గ విషయం ఏమిటంటే ఈ ప్రాంతాలు దొంగ సారా (గుడుంబా) తయారీకి, సట్టాట(జూదం)కూ ప్రఖ్యాతిగాంచినవి. ఈ వ్యాపారాలు నడిపే వాళ్ళలో అగ్రవర్ణాలకు చెందిన (పటేల్) హిందువులున్నారు, ముస్లింలున్నారు. వీళ్ళకు కాంగ్రెస్ (ఐ)తో చక్కటి స్నేహసంబంధాలున్నాయి. వీళ్ళ సహాయం కాంగ్రెస్ (ఐ) కోరితే ఒక్క క్షణంలో మతకల్లోలం పుట్టించగలరు.

రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాన్ని మిరమింపజేయడమే కాంగ్రెస్ (ఐ) ఉద్దేశ్యమయితే అందులో సఫలమయింది. మతకల్లోలాలకు భయపడి వాళ్ళు విరమించారు. అయితే సోలంకి ప్రభుత్వం అక్కడితో ఆగలేదు. ఉద్యమకారులమీద కసి తీర్చుకోదల్చుకుంది. మతకల్లోలాలు రెచ్చగొట్టారన్న ఆరోపణమీద వాళ్ళనాయకులను అరెస్టుచేసింది.

ఇది తిప్పికొట్టింది. ఇప్పుడు ఉద్యమకారులు ఇంకింత సానుభూతిని సంపాదించుకున్నారు. తమ నాయకులను విడుదలచేయాలనే డిమాండుమీద మళ్ళీ ఉద్యమం చేపట్టారు. అంతవరకు సోలంకి ప్రభుత్వం వాళ్ళమీదికి పోలీసులను ప్రయోగించడానికి వెనుకాడింది. డబ్బు, ఆస్తి, హోదా, కులం అన్నీవున్న వాళ్ళాయె. వాళ్ళను ఎట్లా కొట్టించేది? అయినా ఇప్పుడు ధైర్యంచేసి ఆ పాపానికి ఒడిగట్టింది.

ఉద్యమకారులు దీన్నిగూడ వాడుకున్నారు. పోలీసు అత్యాచారాలగురించి విస్తృతంగా ప్రచారం చేసారు. అగ్రవర్ణాలవారేనడిపే పత్రికలు పెద్దపెద్ద హెడ్‌లైన్లు పెట్టిరాసాయి. చివరికి గుజరాత్ హైకోర్టు ఒక వెనుకబడ్డ కులానికి చెందిన పోలీస్ ఆఫీసరును ఒక ప్రాంతానికి పోవడానికి వీలులేదని "ఇంజక్షన్" ఇచ్చి నిషేధించింది. ఇది చరిత్రలోనే అపూర్వమయిన తీర్పు! అందుకే, 'వడ్డించేవాడు మన వాడయితే తక్కువేముంద'ని సామెత.

ఈ గొడవలలో మళ్ళీ ఏప్రిల్ 20, 21, 22 తేదీలలో విపరీతమయిన హింసాకాండ చెలరేగింది. హరిజనులను ముస్లింలను ఏరి చంపారు. ఆ మూడురోజులలో 15మంది చనిపోగా 89 మంది గాయపడ్డారని అధికార అంచనా. అంతలో ఎవరో ఒకపోలీస్ కానిస్టేబిల్‌ను చంపారని వార్తవచ్చేసరికి పోలీసులలో ఒకసెక్షన్ తిరుగుబాటు చేసింది లూటీచేస్తూ దహనంచేస్తూ భీభత్సంచేయడం మొదలు పెట్టారు. పోలీసు అత్యాచారాల గురించి చాలా ప్రచారం చేసిన గుజరాత్ సమాచార్ ఆఫీసును తగలబెట్టారు. ఒక్కమాటలో చెప్పాలంటే కోతులమూక కొబ్బరితోటలో పడ్డట్టయింది.

ఇక అప్పటినుండి పూర్తిగా అదుపుతప్పి నిత్యమారణహోమంగామారిన గుజరాత్ ఇప్పుడే చల్లబడింది. ఎందరో అమాయకుల (ముఖ్యంగా వెనుకబడ్డవర్గాల, ముస్లింల) ప్రాణాలు తీసింది. ఇప్పటికి చల్లబడిందిగానీ మళ్ళీమళ్ళీ 'రిజర్వేషన్-వ్యతిరేకత' అనే ఉన్మాదాన్ని స్వార్ధపరులు లేవదీస్తూనే వుంటారు కాబట్టి రెండుముక్కలలో ఈ ఉన్మాదాన్ని గురించి చర్చించాలి.

రిజర్వేషన్లను వ్యతిరేకించేవాళ్ళునిపుణత(మెరిట్)పేరిటవ్యతిరేకిస్తుంటారు. అంటే రిజర్వేషన్లే లేకుంటే నిపుణతకు గుర్తింపుఉంటుందనే భ్రమ కలిగిస్తారు. ఇది ఎంతమాత్రం వాస్తవంకాదు. నిజంగా నిపుణతనుబట్టి వచ్చే ఉద్యోగాలుగాని కాలేజీసీట్లుగాని తక్కువ. కొందరికి రిజర్వేషన్లమీదవస్తే కొందరికి రికమెండేషన్‌వల్ల, కొందరికి డబ్బువల్ల, కొందరికి కులతత్వంవల్ల, కొందరికి స్థానికబలంవల్లవస్తుంటాయి.

రెండవది, రిజర్వేషన్లవల్ల ఏదో నాశనం అయిపోతోందంటూ జరిగే ఈ గోలలో అందరూ ఆలోచించడం మరచిపోతున్న విషయం ఏమిటంటే, అసలు రిజర్వేషన్లు ఎంతవరకు అమలవుతున్నాయన్నది కేవలం ప్రభుత్వ ఆఫీసులలోని నాలుగవ తరగతి ఉద్యోగులకు తప్ప వేరే ఏ రంగంలోనూ సరిగ్గా అమలుకావడంలేదు. (ముఖ్యంగా హరిజన గిరిజనులకు). అసలు దీనిగురించి అలజడి జరగవలసిందిపోయి రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాలు వస్తున్నాయి.

అన్నిటికంటె ముఖ్యంగా, వున్న పిడికెడు ఉద్యోగాలను ఎట్లాపంచుకోవాలని కొట్లాడుకోవడం సరయిందికాదు. అందరికీ ప్రభుత్వంఉద్యోగాలు కల్పించాలని అందరూ ఉమ్మడిగా ఉద్యమించాలి. అప్పుడే ఈ సమస్య పరిష్కారమవుతుంది.

# రిపోర్టులు

## కారంచేడు: ఇది టెర్రరిజం కాదు

ముందుగానే వేసుకున్న పథకంప్రకారం జులై 17 ఉదయం కారంచేడు భూస్వాముల పాశవికదాడిలో ఆరుమంది హరిజనులు గొడ్డళ్ళతో, బరిసెలతో నరికి చంపబడ్డారు. ముగ్గురు స్త్రీలు మానభంగం లైంగిక అత్యాచారాలకు గురయ్యారు. ఎంతోమంది తీవ్రమైన గాయాలతో ఇంకా హాస్పిటల్‌లో ఉన్నారు. మాదిగపల్లిలోని ఇళ్ళు ధ్వంసం చేయబడ్డాయి. హరిజనులందరూ నిరాశ్రయులై ప్రాణాలు అరచేతబట్టుకుని చీరాలలో తలదాచుకుంటున్నారు. పదిరికుప్పం, బండారుపల్లి, వెంకటకృష్ణాపురం పక్కిలో జరిగిన ఈఘటన జనతాహయాంలో బెల్చి మారణకాండను (1978) మరపించేదిగా ఉంది. కోటికి పడగలెత్తిన భూస్వాములు, రాష్ట్రరాజకీయనాయకులు (ముఖ్యమంత్రి బంధువర్గం), సినిమాప్రొడ్యూసర్లు, పరిశ్రమాధిపతులకు నిలయమైన కారంచేడుగ్రామం ప్రకాశంజిల్లా చీరాల తాలూకాలోనిది. నగరాలను మరపించే భవంతులతో నిండిన ఈ గ్రామం ఆంధ్రలో ఎంతో అభివృద్ధి చెందినగ్రామంగా చెప్పుకుంటారు. అయితే